
నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL

# నో స్టాక్

## ఎంఎల్ఎస్ పాయింట్లలో సన్నబియ్యం నిల్వలు ఖాళీ

- సన్న బియ్యానికి బదులు దొడ్డు బియ్యం
- డీలర్లతో గొడవ పడుతున్న లబ్ధిదారులు
- బియ్యం రాకపోవడంతో లేవని బోర్డులు పెడుతున్న డీలర్లు
- లబ్ధిదారుల నిరాశ.. బియ్యం పంపిణీ తేదీని పొడిగించాలి..
- సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి




దొడ్డుబియ్యం వచ్చిందంటూ చూపెడుతున్న రేషన్ డీలర్

సన్నబియ్యం పంపిణీ చేయాలంటూ రేషన్ డీలర్లు కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రం

ఆదిలాబాద్, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో సన్నబియ్యం పంపిణీ ఆదిలోనే హంసపాదుగా మారింది. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించినా ప్రహసనంగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. సన్నబియ్యం పంపిణీలో సమస్యలు పరిష్కరించాలని స్వయంగా డీలర్లు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో పంపిణీ పథకం లోప భూయిష్టంగా ఉందనడానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఆదిలాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో 1,91,676 మంది లబ్ధిదారులకు 356 రేషన్ దుకాణాల ద్వారా ప్రతినెల 4062.83 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది. మార్చి నెల వరకు ఫ్లోరిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేసిన ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నుంచి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించింది.

### దర్శనమిస్తున్న బియ్యం లేవనే బోర్డులు

ఆదిలాబాద్ జిల్లాలో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ ప్రారంభం కాగా మొదటి నుంచి సమస్యలు వెంటాడుతున్నాయి. పలు మండలాల్లో గ్రామాలకు బియ్యం పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. ఆదిలాబాద్ పట్టణంలోను పలు దుకాణాల్లో ఐదు రోజులుగా పంపిణీ నిలిచింది. పట్టణ పరిధిలో 42 దుకాణాలు ఉండగా చాలా దుకాణాల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి వచ్చిన బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశామని, స్టాక్ అయిపోవడంతో బోర్డులు పెట్టాల్సి వచ్చిందని రేషన్ డీలర్లు అంటున్నారు. సన్నబియ్యం తీసుకుందామని దుకాణాలకు పోయిన లబ్ధిదారులు నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

### కలెక్టర్‌కు వినతిపత్రం

సన్నబియ్యం పంపిణీలో సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్లు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంఎల్ పాయింట్ల నుంచి సన్నబియ్యంకు బదులు దొడ్డుబియ్యం సరఫరా అవుతున్నాయని, ఈ బియ్యం పంపిణీ చేస్తే లబ్ధిదారులు తమతో గొడవకు దిగుతున్నారని తెలిపారు. బియ్యం సరఫరా కాకపోవడంతో దుకాణాలను మూసివేసి నో స్టాక్ బోర్డులు పెట్టామని, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద బియ్యం నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పోర్టబిలిటీ వచ్చిన వెంటనే అలాట్‌మెంట్‌కు సరిపడా బియ్యం రేషన్ దుకాణాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని, నిల్వలు లేని కారణంగా పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతుందని, లబ్ధిదారులకు బియ్యం అందేలా పంపిణీ తేదీని పొడిగించాలని వినతిపత్రంలో కోరారు.

### దొడ్డు బియ్యం ఇస్తున్నారు..

"ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని పలు దుకాణాలకు ఎంఎల్ఎస్ పాయింట్‌ల నుంచి సన్నబియ్యం రావడం లేదు. దొడ్డు బియ్యం ఎందుకు వస్తున్నాయని సివిల్ సప్లయ్ అధికారులను అడిగితే గంగా, గోదావరి రకం సన్నబియ్యం దొడ్డుగానే ఉంటాయని సమాధానం ఇస్తున్నారని రేషన్ డీలర్లు అంటున్నారు. ఈ బియ్యం తీసుకున్న లబ్ధిదారులు తమతో గొడవ పడుతున్నారు. దుకాణాల్లో బియ్యం అయిపోగా సరఫరా చేయాలని అధికారులను అడిగితే నిల్వలు లేవని అంటున్నారు. దీంతో నో స్టాక్ బోర్డులు పెట్టాల్సి వచ్చింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి."

- వేణుగోపాల్, అధ్యక్షుడు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం, ఆదిలాబాద్




షట్టర్‌కు నో స్టాక్ స్టిక్కర్ అంటిస్తున్న డీలర్



రేషన్ దుకాణానికి నో స్టాక్ బోర్డు



ఎదులాపురం : ఖాళీ సిలిండర్లు, కట్టెల పొయ్యితో వినూత్నంగా నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

# ఖాళీ సిలిండర్లు.. కట్టెల పొయ్యి..

- వినూత్నంగా నిరసన తెలిసిన సీపీఐ, సీపీఎం నాయకులు
- పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్

ఎదులాపురం, ఏప్రిల్ 10 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నదని సీపీఎం ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. గురువారం పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ భగత్‌సింగ్ కాలనీలో నిరసన తెలిపారు. ఖాళీ సిలిండర్లు, కట్టెల పొయ్యితో వినూత్నంగా ఆందోళన చేపట్టి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్‌పై సబ్సిడీ ఇస్తామని చెప్పి ధరను పెంచడం దారుణమన్నారు. కార్పొరేట్ బడా వ్యాపారుల కోసం తాపత్రయ పడే బీజేపీ ప్రభుత్వానికి పేదల గురించి పట్టడం లేదన్నారు. పెరిగిన ధరలతో ఇప్పటికే సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచడంతో వారికి భారం అవుతుందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మంజుల, బొజ్జ ఆశన్న, ప్రభు, ఆశన్న, అరిఫా, పూసం సయ, రేణుక, మయూరి, నగేశ్, సునీత పాల్గొన్నారు.

### పోరాటం ఉధృతం చేస్తాం..

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 10 : మోదీ సర్కార్ వంట గ్యాస్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ.2లను పెంచిందని, వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం నిర్మల్ పట్టణంలోని ట్యాంక్ బండ్ వద్ద సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ.. పెంచిన ధరలకు తగ్గించకపోతే అన్ని పార్టీల సంఘాలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బక్కన్న, రామ్-లక్ష్మణ్, రేష్మ, దేవక్క పాల్గొన్నారు.



నిర్మల్ అర్బన్ : ఖాళీ సిలిండర్‌తో నిరసన తెలుపుతున్న నాయకులు

### కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖానాపూర్, ఏప్రిల్ 10 : వంట గ్యాస్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఖానాపూర్ పట్టణ శివారులోని కుమ్రం భీం చౌరస్తాలో గురువారం సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రోడ్డుపై వంట చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ కార్యదర్శి నంది రామయ్య మాట్లాడారు. బీజేపీ విధానాలతో గ్యాస్ ధర రూ.50 పెంచడంతో పేదల బతుకు భారమై అప్పుల భారం మోపుతున్నారని మండిపడ్డారు. ఇక్కడ నాయకులు ఎల్లయ్య, సుదర్శన్, గోరేబాయ్, వర్మ, కృష్ణ, రాజేశ్వర్, కమల పాల్గొన్నారు.



ఖానాపూర్ : రోడ్డుపై సిలిండర్ పెట్టి వంట చేస్తున్న స్థానికులు

# అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్, ఏప్రిల్ 10 : ప్రభుత్వ అభివృద్ధి పనులు, పథకాల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. నార్నూర్ మండలంలోని నడ్డంగూడ, చిత్తగూడ గ్రామాల్లో గురువారం పర్యటించారు. నడ్డంగూడ సీఎస్సీ కేంద్రాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్షం వారోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎస్సీ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత నివారణకు ఐసీడీఎస్, వైద్యశాఖ సమన్వయంతో కృషి చేయాలన్నారు. అనంతరం చిత్తగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆయా శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వికలాంగులకు మూడు చక్రాల సైకిల్స్‌ను పంపిణీ చేశారు. ఇక్కడ మండల ప్రత్యేకాధికారి గంగధార్, డీఎల్‌పీవో ప్రభాకర్, తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో జవహర్‌లాల్, ఐసీడీఎస్ పీడీ మిల్కా, సీడీపీవో శారద, వైద్యాధికారి సంజీవ్, డీఈలు జాడి లింగన్న, శ్రీనివాస్, శివప్రసాద్ ఉన్నారు.



చిత్తగూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తునన కలెక్టర్ రాజర్షి షా



కుంటాల మండలంలోని విట్టాపూర్‌లో టార్పాలిన్‌లు కప్పడానికి తంటాలు పడుతున్న రైతులు

# అకాల వర్షం.. రైతన్నకు కష్టం


కుంటాల, ఏప్రిల్ 10 : పెంచికల్‌పాడ్, విట్టాపూర్, అందకూర్, కుంటాల, వెంకూర్ గ్రామాల్లో గురువారం కురిసిన అకాల వర్షానికి కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన మక్క, జొన్న పంటలు తడిసి ముద్దయ్యాయి. పంట ఉత్పత్తులపై టార్పాలిన్ కవర్లు కప్పడానికి తంటాలు పడ్డారు. వెంటనే జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

### అకాల వర్షం..

దిలావర్‌పూర్, ఏప్రిల్ 10 : దిలావర్‌పూర్, న్యూ లోలం, సిర్గాపూర్, కాల్వ గ్రామాల్లో గురువారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. రైతులు ఆరోబోసిన పసుపు, మొక్కజొన్న ఇతర పంటలను రక్షించుకునేందుకు తిప్పలు పడ్డారు. వర్షంతోపాటు ఈదురు గాలులు వీయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాంసి(భీంపూర్), ఏప్రిల్ 10 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి వద్ద బుధవారం రాత్రి ఈదురుగాలులకు విద్యుత్ లైన్‌పై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో మండలవాసులు కరెంటు లేక ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. అయితే గురువారం విద్యుత్ శాఖ సిబ్బంది సరఫరా పునరుద్ధరించినా.. మళ్లీ కొన్ని గ్రామాల్లో లో వోల్టేజీ సమస్య ఏర్పడింది. సమస్య పరిష్కారానికి ఏఈ, సిబ్బంది కృషి చేస్తున్నారు.



దిలావర్‌పూర్‌లో రాలిన మామిడి కాయలు

# బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ గంగవ్వ

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 10 : మామడ మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గంగవ్వతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీని వీడి గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాండ్రలో జరిగిన ఈ చేరిక కార్యక్రమాన్ని ఉద్దేశించి రాంకిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేవలం 15 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. మోసకారి కాంగ్రెస్‌ను గెలిపించి తప్పు చేశామని రైతులు, ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్‌ను వీడి పార్టీలో చేరిన వారిలో సీనియర్ నాయకులు భాస్కర్, లింగం, గంగాధర్, శివన్న, సురేశ్ గౌడ్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రాం కిషన్‌రెడ్డి



బృందం సభ్యులతో డీఆర్డీవో రవీందర్ రాథోడ్

# ఇందిరమ్మ మండల సమాఖ్యను సందర్శించిన యూపీ బృందం

జైనథ్, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలోని ఇందిరమ్మ మండల సమాఖ్యను గురువారం తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కె.అనిల్ కుమార్ నేతృత్వంలో ఉత్తరప్రదేశ్(యూపీ) రాష్ట్రానికి చెందిన 23 మంది ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రవీందర్ రాథోడ్ స్వయం సహాయక సంఘాల అభివృద్ధిపై వివరించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మహిళ సంఘాలకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని బృందం సభ్యులు ప్రశ్నించారు. పంచాయతీరాజ్ ద్వారా గ్రామ పంచాయతీల అభివృద్ధి, గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా మహిళ సంఘాల అభివృద్ధి జరుగుతుందని డీఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, అడిషనల్ సీఈవో రాథోడ్ రాజేశ్వర్, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, ఏపీడీ గోవింద్‌రావ్, డీపీఎంలు గంగన్న, శేషారావ్, హేమలత, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంపీవో వెంకటరాజు, ఎంఈవో శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, ఏవో పూజ, ఏపీఎం భగవాండ్లు పాల్గొన్నారు.

### శ్రీలక్ష్మి నారాయణస్వామిని దర్శించుకున్న బృందం

జైనథ్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట ఎండోమెంట్ చైర్మన్ అడ్డి రుకేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి ఉన్నారు.